## క్లుప్తంగా

### భూ రీ సర్వేను పూర్తి చేయండి



మాట్లాడుతున్న రీ సర్వే ప్రత్యేక అధికారి సుబ్బారావు

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో జగనన్న శాశ్విత భూ హక్కు, భూ రక్షలో భాగంగా జరుగుతున్న భూ రీ సర్వే ఈ నెలాఖరు కల్లా పూర్తి చేయాలని రీ సర్వే ప్రత్యేక అధికారి బి.సుబ్బారావు అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో రీ సర్వేపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ఏ సర్వే నంబర్‌లో ఏ రైతు ఉన్నాడు, ఖాళీ భూములు ఎక్కడెక్కడ ఉన్నాయి, ప్రభుత్వ భూములు ఏవి అనే విషయాలపై త్వరితగతిన రీ సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. రీ సర్వే పూర్తి కాగానే రైతులకు భూ హక్కు పత్రాలను అందజేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో డీటీసీపీ అడిషనల్ డైరెక్టర్ ఎ.ప్రభాకర్ రావు, డీటీసీపీఓ కృష్ణ, మున్సిపల్ కమిషనర్ వై.రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

### క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ



ఎంపికైన విద్యార్థులతో ఎయిర్‌ఫోర్స్ అధికారులు

బద్వేలు అర్బన్ : క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ అని, దీని ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని తిరుపతి ఎన్‌సీసీ-11(ఎ) బెటాలియన్ ఎన్‌సీసీ అధికారులు జ్వాయ్, సంతోష్‌కుమార్‌లు తెలిపారు. గురువారం స్థానిక రాచపూడి నాగభూషణం డిగ్రీ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి గాను ఎన్‌సీసీ ఎయిర్‌ఫోర్స్ విభాగానికి విద్యార్థినీ విద్యార్థుల ఎంపికలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఫిజికల్, మెడికల్ పరీక్షల ఆధారంగా 26 మంది విద్యార్థినీ విద్యార్థులను ఎంపిక చేశారు. ఎన్‌సీసీ సర్టిఫికెట్లు ఉద్యోగ అవకాశాలలో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ఏఓ, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయికృష్ణ, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఎన్‌సీసీ ఎయిర్‌ఫోర్స్ విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### శరన్నవరాత్రి ఉత్సవాల పుస్తకావిష్కరణ

పోరుమామిళ్ల : శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ శరన్నవరాత్రి ఉత్సవాల పుస్తకాలను గురువారం స్థానిక దేవస్థాన అధ్యక్షుడు గాజులపల్లె శ్రీనివాసులు, ధర్మకర్త రాకేష్‌ల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈనెల 15న రాజరాజేశ్వరీదేవి అలంకారంతో 25వ తేదీ వరకు ప్రతి రోజు రాత్రి దేవీ అలంకారాలు ఉంటాయన్నారు.

### 27న అరుణాచలంకు ప్రత్యేక బస్సు సర్వీసు

ప్రొద్దుటూరు : ప్రయాణికుల సౌకర్యార్థం ప్రొద్దుటూరు నుంచి అరుణాచలంకు ఈనెల 27న ప్రత్యేక బస్సు సర్వీసు నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం మల్లికార్జునరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 27న సాయంత్రం 6 గంటలకు స్పెషల్ సూపర్ లగ్జరీ బస్సులను ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. సూపర్ లగ్జరీ టికెట్ ధర రూ.1250 అని, ఏపీఎస్ఆర్టీసీ ఆన్‌లైన్‌లో కానీ, సెల్ నంబర్ 9966525210కు సంప్రదించాలని కోరారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

### విద్యార్థులకు హోమియోపతి మందుల పంపిణీ



విద్యార్థులకు మందులు తినిపిస్తున్న దృశ్యం

చాపాడు : మండల పరిధిలోని నరహరిపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు గురువారం ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రి హోమియోపతి వైద్యాధికారి రాజేశ్వరి హోమియోపతి మందులు తినిపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంలో కలిగిన మార్పుల వలన వైరల్ ఫీవర్‌లతో పిల్లలు బాధపడుతున్నారన్నారు. ఈ క్రమంలో ముందస్తు చర్యలలో భాగంగా విద్యార్థులకు హోమియోపతి మందులు తినిపిస్తున్నామన్నారు. వీటి వలన జ్వరాల బారి నుంచి తప్పించుకోవచ్చన్నారు. విద్యార్థులు జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నరసింహ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

### అధిక దిగుబడులను సాధించాలి

కడప అగ్రికల్చర్: శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలను పాటించి రైతులు అధిక దిగుబడులను సాధించాలని కృషి విజ్ఞాన కేంద్ర సమన్వయకర్త డాక్టర్ వీరయ్య సూచించారు. గురువారం కేవీకేలో ముద్దనూరు మండల వాటర్ షెడ్ రైతులకు కేవీకే, జిల్లా నీటియాజమాన్యసంస్థ సంయుక్తంగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కేవీకే ద్వారా పండించిన వివిధ పంటల నాణ్యమైన విత్తనాలు, అంటు మొక్కలను, అలాగే వానపాముల ఎరువులు, పుట్టగొడుగులు, డ్రాగన్‌ఫ్రూట్, కూరగాయలను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు , రైతులు పాల్గొన్నారు.

# జగనన్న ఆరోగ్య సురక్షతో ఇంటింటికీ వైద్యం

ప్రొద్దుటూరు : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ఇంటింటికీ వైద్య సేవలు అందుతున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని మౌలానా ఆజాద్ వీధిలో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, ఆయా వార్డు కౌన్సిలర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**మాతా శిశుసంరక్షణ కోసం ప్రభుత్వం కృషి ..**

మాతా శిశు సంరక్షణ కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ తెలిపారు. మండల పరిధిలోని సోములవారిపల్లె గ్రామ పంచాయతీ ఈశ్వర్‌రెడ్డినగర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్‌ను ఎంపీపీ పరిశీలించారు. డాక్టర్లు రోగులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు.

**ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం**

ప్రొద్దుటూరు క్రైం : రాష్ట్ర ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండటమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ సానబోయిన శేఖర్‌యాదవ్ తెలిపారు. సోములవారిపల్లె పంచాయతి పరిధిలోని వీవీనగర్, సోములవారిపల్లె, సుబ్బారావు కొట్టాలకు చెందిన ప్రజలకు ఈశ్వరరెడ్డినగర్‌లోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి ఇంటికి ఆరోగ్యశ్రీ కింద ఖరీదైన, నాణ్యమైన వైద్యాన్ని ప్రభుత్వం అందిస్తోందన్నారు. డాక్టర్ హనీఫ్‌బాబా మాట్లాడుతూ దృష్టి లోపాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. 127 మందికి ఆప్తాల్మిక్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్, బాల ఓబులేసు కంటి పరీక్షలను నిర్వహించారు. వైద్య శిబిరంలో 494 మందికి వివిధ ఆరోగ్య సమస్యలకు వైద్యులు హనీఫ్ బాబా, ఇలియరాణి, షేక్ జరీనా, షేక్ హుస్సేన్‌బాషాలు వైద్య సేవలను అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కుల్లాయమ్మ, ఎంపీటీసీ బాలగుర్రమ్మ, లక్ష్మీదేవి, ఉప సర్పంచ్ కృష్ణారెడ్డి, ఏఓ బాలయ్య, పంచాయతి కార్యదర్శి హరినాథ పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు : మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి



మైదుకూరు : కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

**నేడు వెల్లాలలో ఆరోగ్య సురక్ష**

రాజుపాళెం : మండలంలోని వెల్లాల గ్రామంలోని శ్రీసంజీవరాయ కల్యాణ మండపంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటరెడ్డి గురువారం తెలిపారు. ఈ శిబిరానికి ప్రత్యేక వైద్యులు వస్తారని, రోగులు వచ్చి చికిత్సలు చేయించుకోవాలని సూచించారు.

**జగనన్న ఆరోగ్య సురక్షతో అందరికీ వైద్య సేవలు**

మైదుకూరు : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని జీవీ సత్రం జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. శిబిరానికి వచ్చిన రోగులతో మాట్లాడారు. వారి అనారోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శిబిరంలో నిపుణులైన డాక్టర్లు ఉన్నారని వైద్య పరీక్షలు చేయించుకుని చికిత్సలు పొందాలని సూచించారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, ఎంపీపీ థామస్, మండల ప్రత్యేక అధికారి కృష్ణమూర్తి, ఎంపీడీఓ ఏవీ రమణారెడ్డి, వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఏవీ సుబ్బారెడ్డి, మండల అధ్యక్షుడు గల్లా నరసింహారెడ్డి, మదీనా దస్తగిరి, మండల కోఆప్షన్ సభ్యుడు ఇంతియాజ్ ఖాన్, సర్పంచ్ చెన్నూరు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



పోరుమామిళ్ల : వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న నాయకులు

**లక్ష్మీపేట శిబిరాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, డీఎంహెచ్ఓ నాగరాజు**

చాపాడు : ప్రభుత్వం నిర్వహిస్తోన్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా సంపూర్ణ వైద్య పరీక్షలు చేయటం జరుగుతుందని.. ఈ శిబిరాలను ఆయా గ్రామ సచివాలయాల పరిధిలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని లక్ష్మీపేట గ్రామంలోని ఎంపీపీ స్కూల్ వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి నాగరాజు పరిశీలించారు. శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు, వైద్యం చేయించుకుంటున్న రోగులతో మాట్లాడారు. ఇదే క్రమంలో ప్రజలకు పోషకాహార విలువల గురించి తెలిపేందుకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలించి, పలువురు గర్భిణులకు ఎమ్మెల్యే, డీఎంహెచ్‌ఓల చేతులమీదుగా సీమంతాలు జరిపారు. అనంతరం విద్యార్థులు, వృద్ధులకు కంటి వెలుగు పథకం క్రింద మంజూరైన కంటి అద్దాలను పంపిణీ చేశారు.

**నేడు కాలువపల్లెలో..**

గోపవరం : మండలంలోని కాలువపల్లెలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రమౌళి తెలిపారు. వలంటీర్లు, వైద్య సిబ్బంది ఇంటింటి సర్వేలో వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించడం జరిగిందని, వారందరూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరానికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకుని అవసరమైన మందులను ఉచితంగా తీసుకెళ్ళాలన్నారు. ఈ శిబిరంలో ప్రత్యేక వైద్య బృందం పాల్గొని రోగులకు వైద్యపరీక్షలు అందిస్తారని, ఈ అవకాశాన్ని కాలువపల్లె పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**కలసపాడులో..**

కలసపాడు : మండలంలోని రాజుపాలెం గ్రామ సచివాలయం ఆవరణలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో 357 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కంటి అద్దాలు పంపిణీ చేశారు. 5 మందిని మెరుగైన వైద్యం కోసం పెద్ద ఆసుపత్రులకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో ఏపీ టూరిజం రాష్ట్ర డైరెక్టర్ పోకల రామకృష్ణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిత్తారాజశేఖర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఎ.విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సూదా రామకృష్ణారెడ్డి, సుదర్శన్, నారాయణయాదవ్, వెంకటరామిరెడ్డి, ఎంపీడీఓ మహబూబ్‌బీ, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

**పోరుమామిళ్లలో..**

పోరుమామిళ్ల : సిద్దవరం సచివాలయంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆప్కాస్ డైరెక్టర్ డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైఎస్ ఎంపీపీ రాజశేఖర్, సర్పంచ్ రవిప్రకాష్‌రెడ్డిలు ప్రజలకు ఆరోగ్య సురక్ష కిట్లను అందజేశారు. వైద్యులు 344 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ ఆరోగ్యమిత్ర శ్రీనివాసులు, వైద్యసిబ్బంది, ఎంపీడీఓ వరప్రసాదరావు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

**నేడు..**

కాశినాయన : మండలంలోని ఇటుగుల్లపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మైథిలి తెలిపారు. సచివాలయ గ్రామాల పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## 15 నుంచి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు

మైదుకూరు : పట్టణంలో ఈనెల 15వ తేదీ నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో 15వ తేదీ ఆదివారం నుంచి 24వ తేదీ మంగళవారం వరకు శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాల్లో ప్రతి రోజు ప్రత్యేక పూజలు, నవగ్రహ కలశ స్థాపనలు, చండీ పారాయణాలు, జపాలు ఉంటాయని ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు సూరిశెట్టి శివవెంకటప్రసాద్ తెలిపారు. గణపతి, చండీ హోమాలు, తీర్థ ప్రసాద వినియోగాలు ఉంటాయని చెప్పారు. ఉత్సవాల్లో ప్రతిరోజు వేలూరు కార్తికేయ శర్మ, ప్రొద్దుటూరు గంజికుంట రాఘవేంద్రలచే అమ్మవారి విశేష అలంకారాలు ఉంటాయన్నారు. దుర్గాష్టమి సందర్భంగా 22వ తేదీ తాడిపత్రి వందన అకాడమీ వారిచే నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని వివరించారు. గ్రామోత్సవంలో ప్రకాశం జిల్లా పేరాలకు చెందిన రామారావు బృందంచే మిరిమిట్లు గొలిపే బాణాసంచా పేలుళ్ల, నెల్లూరు వేడుక ఈవెంట్స్ వారిచే ఆర్కెస్ట్రా, కేరళ వాయిద్య బృందం, చెక్కభజన, కోలాటాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. కాగా ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని ప్రతి రోజు ప్రత్యేక అలంకరణలో దర్శనమివ్వనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.



ఉత్సవాల కోసం సిద్ధమవుతున్న ఆలయం

## దసరా బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన



శివాలయం సెంటర్‌లో సీఐలతో మాట్లాడుతున్న ఏఎస్పీ ప్రేరణాకుమార్

ప్రొద్దుటూరు క్రైం : రానున్న దసరా ఉత్సవాలకు సంబంధించి బందోబస్తు ఏర్పాట్లను ఏఎస్పీ ప్రేరణా కుమార్ గురువారం సాయంత్రం పరిశీలించారు. సీఐలతో కలిసి ఏఎస్పీ నవరాత్రి ఉత్సవాలు జరుగనున్న ఆలయ పరిసర ప్రాంతాలను సందర్శించారు. శివాలయం, చెన్నకేశవస్వామి ఆలయం, రత్నాల వెంకటేశ్వరస్వామి ఆలయం, రాజరాజేశ్వరి ఆలయం, చౌడేశ్వరి ఆలయాలను సందర్శించి కమిటి సభ్యులతో మాట్లాడారు. అలాగే మున్సిపల్ అనిబిసెంట్ హైస్కూల్ మైదానంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఏఎస్పీ పరిశీలించారు. ప్రజల భద్రతకు సంబంధించి నిర్వాహకులకు సూచనలు చేశారు. అలాగే పట్టణంలో ట్రాఫిక్ మళ్లింపు, పార్కింగ్ ఏర్పాట్ల గురించి సీఐలతో చర్చించారు. ఏఎస్పీ వెంట టూటౌన్ సీఐ ఇబ్రహీం, త్రీ టౌన్ సీఐ నారాయణయాదవ్, ట్రాఫిక్ సీఐ యుగంధర్‌లు ఉన్నారు.

## అవగాహన పెంచుకోవాలి

బద్వేలు అర్బన్ : సమాచారహక్కు చట్టంపై ప్రతిఒక్కరు అవగాహన పెంచుకోవాలని సమాచారహక్కు చట్టం రక్షణ వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు బి.గురుమూర్తి తెలిపారు. సమాచార హక్కు చట్టం అమలు దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక ఆర్టీసీయూ మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ స.హ.చట్టం అమలులోకి వచ్చి 18 సంవత్సరాలు పూర్తి కావస్తున్నా నేటికీ 80 శాతం మంది ప్రజలకు చట్టంపై అవగాహన లేకపోవడం దురదృష్టకరమన్నారు. సమాచారహక్కు చట్టం పేదల చుట్టమని, ప్రజల చేతుల్లో వజ్రాయుధం లాంటిదన్నారు. అనంతరం స.హ.చట్టంకు సంబంధించిన ముఖ్యమైన సెక్షన్లు, విధివిధానాలతో కూడిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి బ్రహ్మయ్య, పూలేఅంబేడ్కర్ రాజ్యాధికార సమితి జిల్లా ఇన్‌చార్జి పిచ్చయ్య, బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు గౌస్‌పీర్, ఆవాజ్ పట్టణ అధ్యక్షులు సత్తార్, డీబీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిన్నయ్య, ఆర్టీఐ సీనియర్ ఆక్టివిస్ట్ రాజగోపాల్‌రెడ్డి, కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు శామ్యూల్, దళిత, బీసీ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో కరపత్రాలను విడుదల చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

## ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప డిపోలో పనిచేస్తున్న ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను అధికారులు సత్వరమే పరిష్కరించాలని ఎన్ఎంయూఏ రీజినల్ ప్రెసిడెంట్ నాగముని, సంయుక్త కార్యదర్శి దాస్ కోరారు. గురువారం కడప ఆర్టీసీ బస్టాండు ఆవరణలో అధికారుల తీరును నిరసిస్తూ డిపో కార్యదర్శి సగినాల శ్రీనివాసులు ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైవర్లను బలవంతంగా టిమ్ డ్యూటీలకు పంపడం దారుణమన్నారు. రద్దు పరిచిన సర్వీసులను వెంటనే పునరుద్ధరించాలని కోరారు. వెహికల్ కండీషన్‌ను పూర్తి స్థాయిలో మెరుగు పరచాలని తెలిపారు. కండక్టర్లు, డ్రైవర్ల ఫిక్స్‌డ్ చార్టును వేయాలని కోరారు. డిపో అధికారులు అసోసియేషన్ నాయకుల పట్ల అనుచిత వైఖరిని విడనాడాలన్నారు. అక్రమ సస్పెన్షన్లు రద్దు చేయాలన్నారు. డిపో గ్యారేజీలో ఉద్యోగులకు మంచినీటి సౌకర్యాన్ని కల్పించాలన్నారు. కార్యక్రమంలో డిపో అధ్యక్షులు జయరాం, కోశాధికారి టీఎం బాష, వైస్ ప్రెసిడెంట్ నిజాముద్దీన్, సుబ్బారావు, గ్యారేజీ అధ్యక్షుడు రవి, ప్రభాకర్, వరదారెడ్డి, జబ్బార్, మున్ను తదితరులు పాల్గొన్నారు.



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎన్ఎంయూఏ రీజినల్ ప్రెసిడెంట్ నాగముని

### రేపు ఉర్దూ కవి సమ్మేళనం

కడప కల్చరల్ : కడప బజ్మె జావీద్ ఉర్దూ సాహితి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీ సాయంత్రం 6.30 గంటల కు కడప కోటగడ్డవీధిలోని సాహిర్ మంజిల్‌లో ఉర్దూ కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు రిటైర్డ్ ప్రొఫెసర్ సత్తార్ సాహిర్ తెలిపారు. ఈ సమ్మేళనంలో రాయచోటి బజ్మె సాఖి ఎ సుఖన్ సంస్థ స్థాపకుడు డాక్టర్ ఇమామ్ ఖాసీం సాఖి, ముఖ్య అతిథిగా జెమ్స్ హైస్కూల్ డైరెక్టర్ మజ్హర్ అలీఖాన్‌లు పాల్గొంటారన్నారు. డాక్టర్ ఖాజాపీర్ పర్యవేక్షిస్తారన్నారు. జిల్లాలోని ఉర్దూ కవుల సాహితీ, అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

## • పంటలకు నీటితడులు

రైతులు సాగు చేసిన పత్తి, మినుము, జొన్న, సోయాబీన్ పంటలు ఎండుముఖం పట్టడంతో గత మూడు రోజులుగా నీటితడులు అందిస్తున్నారు. కేసీ చాపాడు కాలువ నుంచి మోటర్లు, ట్రాక్టర్లు, ఆయిల్ ఇంజన్ల ద్వారా పంటలకు నీటిని అందిస్తున్నారు. ఒక్క తడికే ఎకరాకు రూ.2 వేల నుంచి రూ.4 వేల వరకు అదనంగా ఖర్చవుతోందని, ఒక్కసారి వర్షం వచ్చి ఉంటే ఈ కష్టాలు తప్పేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం వేళల్లో ఆకాశం మేఘావృతం అవుతుందే తప్ప చినుకు పడలేదు. వర్షం పడాలని రైతులు దేవుళ్లను వేడుకుంటున్నారు. – రాజుపాళెం



కేసీ చాపాడు కాలువలో పారుతున్న నీరు



జొన్న పంటకు నీటిని అందిస్తున్న రైతు



పత్తి పంటకు నీటితడి అందించడంతో పచ్చగా కళకళలాడుతున్న దృశ్యం

### యువతను విస్మరిస్తున్న బీజేపీ

కడప వైఎస్ఆర్ సర్కిల్ : దేశంలో, రాష్ట్రంలో నిరుద్యోగ యువతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు బొజ్జా తిరుమలేష్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని పలు ప్రాంతాల్లో యువతతో సమావేశాన్ని నిర్వహించారు. ఏపీపీఎస్సీ గ్రూప్ 1,2,4 తోపాటు ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్, ఇంజనీరింగ్, ఉపాధ్యాయులు, వివిధ కళాశాలల అధ్యాపకులు, విశ్వవిద్యాలయ అధ్యాపకులు వంటి ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని వాటి భర్తీకి చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు నందిమండలం విజయ్ సుశీల్ ప్రొద్దుటూరు వంశీ యాదవ్, చంద్రశేఖర్, వంశీ రెడ్డి, సాయి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

### వృద్ధురాలు అదృశ్యం

కడప అర్బన్ : కడప నగ రంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జ్ఞానమణి దేవయాని (74) అనే వృద్ధురాలు ఈనెల 7వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తరువాత కనిపించలేదని ఆమె కుమారుడు సువర్ధన్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈక్రమంలో వృద్ధురాలి ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప టూటౌన్ ఎస్ఐ సంజీవరాయుడు తెలిపారు.

### నాసిరకపు శనగలు సరఫరా చేస్తే ఎలా..?

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలో రబీ సీజన్లో శనగ పంటను సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం సరఫరా చేసిన విత్తన శనగలు నాసిరకంగా ఉన్నాయని, సరఫరా చేసిన కాంట్రాక్టర్ పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి దస్తగిరి రెడ్డి తెలిపారు. గురువారం సీపీఎం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీ విత్తన అభివృద్ధి సంస్థ ద్వారా శనగలు కాంట్రాక్టర్‌కు అప్పచెప్పారని సీడ్స్ సర్టిఫికేషన్ ఆఫీసర్లు కాంట్రాక్టర్ తో లాలూచీ పడిన కారణంగానే నాసిరకపు శనగలు రైతులకు పంపిణీ చేశారన్నారు. కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలన్నారు.

### 29న దూదేకుల సింహ గర్జన

కడప రూరల్ : ఈ నెల 29వ తేదీన గుంటూరులో నిర్వహించే నూర్‌బాష్ దూదేకుల సింహ గర్జన సభను జయప్రదం చేయాలని ఏపీ దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు రాయల్‌బాబు, రాష్ట్ర నాయకులు చిన్న రాజా, కేపీ హుస్సేన్ తెలిపారు. గురువారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో వారు సింహ గర్జన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ దూదేకులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలన్నారు.

## నియోజకవర్గంలో ఆయకట్టు రోడ్ల నిర్మాణాలు

చాపాడు : మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా కేసీ ఆయకట్టు పరిధిలో రూ. 22కోట్లతో గ్రావెల్ రోడ్ల నిర్మాణాలు చేపట్టినట్లు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. మండలంలోని ఓబుళరెడ్డిపేట గ్రామంలో రూ.27లక్షలతో రూ.2.75 కి.మీ మేరకు గ్రావెల్ రోడ్డు నిర్మించేందుకు గురువారం ఎమ్మెల్యే పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మైదుకూరు నియోజకవర్గ పరిధిలోని కేసీ ఆయకట్టు పొలాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా వ్యవసాయం సవ్యంగా చేసుకునే విధంగా రూ. 22 కోట్లతో రోడ్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. ప్రభుత్వం నుంచి ప్రత్యేక అవసరాల కింద నిధులను మంజూరు చేయించామన్నారు. ఆయా మండలాల పరిధిలోని ఆయకట్టులో వేగంగా రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని, కేసీ కెనాల్ అధికారులు దగ్గరుండి పనులు చేయిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నాగిరెడ్డి, ఎంపీపీ లక్షుమయ్య, కేసీ కెనాల్ డీఈఈ బ్రహ్మారెడ్డి, ఏఈ సుబ్బరాయుడు, సర్పంచ్ రాజేష్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వేమారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఓబులరెడ్డి, నాగిరెడ్డి, సర్పంచ్ ప్రసాద్, నిరంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

## బాల్య వివాహాలను అరికడదాం



కమిటీ ఎన్నికను ప్రకటిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి

మైదుకూరు : బాల్య వివాహాలకు అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి అన్నారు. మండలంలోని జీవీ సత్రంలో గురువారం ఆమె బాల్య వివాహాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల ఆడపిల్లలు శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. బాల్య వివాహాల సమాచారాన్ని ఆయా గ్రామాల్లో ఉన్న బాల్య వివాహాల నిర్మూలన కమిటీకి తెలియజేయాలని కోరారు. అనంతరం కమిటీని ఏర్పాటు చేశారు. మండలంలోని నంద్యాలంపేట సచివాలయం-1 పరిధి కమిటీ అధ్యక్షుడిగా సర్పంచ్ చెన్నూరు ఓబయ్య, సభ్యులుగా పంచాయతీ కార్యదర్శి మాల్యాద్రి, వీఆర్‌ఓ నరసింహారావు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు లియాఖత్, పొదుపు సంఘం సభ్యురాలు అనూష, పంచాయతీ వార్డు సభ్యురాలు కాంతమ్మ, ఏఎన్ఎం ప్రశాంతి, అంగన్‌వాడీ కార్యకర్త శోభారాణి ఎంపికయ్యారు. కమిటీ సచివాలయం మహిళా పోలీసు ఎం.రమణమ్మ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.

## సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు : మండలంలోని కల్లూరు గ్రామంలో గురువారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ రమణా రెడ్డి మాట్లాడుతూ వరి పైరులో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ట్రైకోడెర్మావిరిడి, సూడోమోనస్ జీవన ఎరువుల ఉపయోగాలను రైతులకు వివరించారు. ఊటుకూరు కీటక పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సునీల్ కుమార్ మాట్లాడుతూ రైతులు వరి సాగుకు ఎంచుకోవాల్సిన విత్తన రకాలు, విత్తన శుద్ధి, నారు మడులలో వచ్చే చీడపీడలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వరిలో కాలిబాట ప్రాముఖ్యతను తెలిపారు. భూసార పరీక్షలు, జీవన ఎరువుల గురించి రైతు శిక్షణ కేంద్రం ఏఓలు పద్మజ, శైలజ వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ శివశంకర్‌రెడ్డి, గ్రామ వీఏఏ, రైతులు పాల్గొన్నారు.



వరిపైరులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్న వ్యవసాయాధికారులు